



క్రాలేజినుంచి ఇంటికి వచ్చేసరికి తనకు కనపడ్డ దృశ్యం. పక్కింటివాళ్ళ ఇంటికి తాళంవేసి ఉండటం. ఆడపిల్ల కాదు తాను. లేకపోతే బావురుమని యేడ్చి ఉండేవాడు. ఇప్పుడుకూడా, లోపలంతా ఏడుపు గుడుసుళ్ళు తిరుగుతూనే ఉంది. కాని కళ్ళు తడికావటంలేదు. భ్రాంతి ఏమోనని కళ్ళు పెద్దవి చేసుకుని పదే పదే చూశాడు. బ్రహ్మరాక్షసి నాలుక వెళ్ళబెట్టినట్లుగా వికృతంగా ఉంది తాళం.

మనస్సు ఎంత కోసుకుపోయింది ఆ తాళం చూసేసరికి. ప్రతిరోజూ ఈ వేళయ్యే సరికి కూనిరాగాలు తీస్తూ, అందమైన పెద్దపెద్ద కళ్ళతో గోడలతోనూ, పై కప్పుతోనూ సంభాషిస్తూ, వరండాలో పచార్లు చేస్తూ ఉండేది సంధ్య. ఆ అమ్మాయిపేరు విన్న రోజునే, తన మనస్సు వెన్నెలరాత్రి విరగబూచిన నైట్‌క్వీన్ పొద కాలేదు! ఆ సాయం కాలం కనపడ్డది. సన్నగా, పొడుగ్గా, అందంగా, బంగారుతీగలా, పండిన తమలపాకులా ఆ అమ్మాయి. తాను చూశాడు. తనవేపూ చూసింది. నిర్ల క్ష్యంగా అవాళనుంచీ రోజూ చూస్తూనే వచ్చాడు. బ్యాంక్ ఏజంటుగారి అమ్మా యిట. అంతకు పూర్వ మున్న ఆయన గారు బదిలీ అయిపోతే, వీరు వచ్చి ఈ ఇంట్లో దిగారు. కాని మరి ఇవాళ తాళం వేసి పోవటం ఎందుకు? వచ్చిన ఈ ఆర్నెల్లుగా ఎప్పుడూ తాళం వేయ లేదే. సినిమాకుగాని పోయారా? భగ వంతుడా, అంతే జరిగితే బాగుండును. కాదు, అదికాదు జరిగింది. వాళ్ళు ఏదో ఊరి కెళ్ళిపోయారుట ఏ ఊరోకూడా కనుక్కోలేదు అమ్మ. ఎందుకో వాళ్ళంటే తాత ఉదాశీనత. తనకోస మైనా కనుక్కొని ఉండవచ్చుగా. తను ఈ ఆర్నెల్లనుంచీ వాళ్ళను గురించి ఎన్ని ప్రశ్నలు వేశాడు అమ్మను. వాళ్ళ గురించి ముఖ్యంగా వాళ్ళ సంధ్యను గురించి. తెలుసుకోవాలని ఎంత ఉత్సా హం చూపాడు. మన శాఖేనా వాళ్ళు. ఆ పిల్ల ఏం చదువుకుంటున్నదమ్మా. వాళ్ళు బాగాడబ్బు కలవాళ్ళా? ఇత్యాదిగా రోజూ వాళ్ళనుగురించి భోగట్టాచేస్తూనే వచ్చాడు కదా. ఆపిల్ల తమఇంటికివచ్చి కాసేపు కూచుని ఏదైనా పుస్తకం ఉంటే ఇవ్వమని అడిగిందని, ఓ రోజున అమ్మ చెప్పినప్పుడు, ఓహ్, తాను ఆ అమ్మాయి, చెయ్యిపట్టుకుని సినిమాలకూ, పార్కులకూ, షికార్లకూ తిరిగినట్లు మురిసిపోలేదూ. ఆరోజునుంచీ ఎప్పుడూ కాలేజీ లైబ్రరీ మొహం చూడని తాను, వెళ్ళి ఆ పుస్తకం, ఈ పుస్తకం చదివి, ఇంట్లో తెచ్చిపడవేయలేదూ! ఆ ఇంట్లో చిన్నపిల్లలు చింపితే, అయ్యోపాపం, చదువుతుంటే చినిగిపోయింది కాబోలని మళ్ళీ జిగురు తెచ్చి అతికించి, లైబ్రేరి యన్ హెచ్చరించినా, మనసులో ఏమీ బాధపడకుండా, తేలికగా తీసి పారవేయ లేదూ. అటువంటి ఆ అమ్మాయి, ఈ ఆర్నెల్లనుంచీ. రోజూ చూస్తూ, ఎప్పు డెప్పుడు సాయంకాలం అవుతుందా అని ఎదురుచూసే మనసుతో, తనసంతానిండిన ఆ అమ్మాయి ఏదో ఊరి కెళుతూ, తనతో మాట మాత్రమన్నా చెప్పకుండా, మళ్ళీ ఇన్ని రోజులకు వస్తామని ఐనా చెప్ప కుండా, అమ్మకుకూడా వాళ్ళు ఏ ఊరు వెళుతున్నారో తెలియకుండా వెళ్ళిపోతే దుఃఖంకాదూ. దుఃఖమా! దుఃఖమా?




ఈ దుఃఖానికి అంతెక్కడ. ఎట్లా మరచిపోవాలి సంధ్యను. ఆవాళ అన్నం తినలేకపోయాడు. అమ్మమీద ఏంతో కోపం వచ్చింది. ఎక్కడా నిలవలేక పోయాడు. కూచోలేకపోయాడు. దిండు దుప్పటి తీసుకుని డాబామీదకు వెళ్ళి ఒంటరిగా పడుకుంటే, సంధ్యను గురించి ఆలోచనతోనే మనసంతా బరువెక్కి పోయింది. సంధ్య ఎంత బావుంటుంది! రోజూ ఎంతమందిని చూస్తుంటాడు తను. కాలేజీలో చదివే పిల్లలు, ఇంకా వీధుల్లో, సినిమా హాళ్ళల్లో పార్కుల్లో; కాని వాళ్ళెవ్వరూ, సంధ్య అంత అందంగా ఉండరు. ఎన్నాళ్ళకూ మరచిపోలేకపోయాడు.

ఇది ఏడాదిక్రిందటి మాట.

తను బి.ఎ. ప్యాసైనాడు.

హైదరాబాదు వచ్చాడు ఎమ్. ఏ. చదువుకుందుకు.

నగరం ఎంతో బావుండేది క్రొత్తలో.

వెడల్పయిన వీధులూ, శుభ్రంగా కూడా.

ఆ వీధుల్లో ఏవేవో అందమైన ఊహలతో, కలలతో, ఎంతెంత దూరమో నడిచిపోతూ ఉండేవాడు.

ఎమ్. ఏ. లో చేరాడు.

కలలు బావున్నాయి; కాంక్షలు తియ్యగా వున్నాయి.

కాని ఓరోజున సాయంకాలం.

వాన కురిసి వెలిసింది. నగరమంతా ఎంతో అందంగా ఉంది.

మనస్సు ఏదో ఉత్సాహంతో, ఆనందంతో ఉరకలు వేస్తున్నది.

టవర్ క్లాక్‌లోని ముల్లులు ఐదున్నర చూపిస్తున్నాయి.

కాఫీహోటల్‌లో కాఫీ త్రాగి తే

ఇవాళ యెందుకో ఎంతో తృప్తిగా ఉంది. రుచికూడా ఇంతకుముందుది కాదు

శేఖరం వెళ్ళి, టవర్ క్లాక్‌కు ఓ వందగజాల దూరంలో ఉన్న పార్కులో పోయి కూచున్నాడు.

ఆకాశంనిండా రంగురంగుల మబ్బులు.

వీధుల్లో సిటీబస్సులు. అలసటతో, ఆనందంతో, ఆశతో, మనుషులు అటూ ఇటూ తిరుగుతున్నారు.

ఆరోజుకు చివరిసారిగా ఎర్రని ఎండ, చెట్ల తలలపైనా, ఎత్తైన మేడలపైనా, అందంగా వెలుగుతున్నది.

పచ్చని పూలు, ఆ చెట్టు పేరేమో కాని, ఆకులనిండా గుత్తులుగుత్తులుగా, ఒత్తుగా. ఆ చెట్టుకింద ఎత్తుగా సిమెంటు బెంచి.

శేఖరం వెళ్ళి దానిమీద కూలబడ్డాడు.

పార్కు గేటుకు ఎదురుగా గవర్నమెంటు హాస్పిటలు.

వరుసగా గదులుగదులు. ఆ కిటికీల్లోంచి, లోపల పడుకున్న, కూచున్న, అలసటతో అటూఇటూ పచార్లు చేస్తున్న రోగులు. అక్కడ అప్పుడే లైట్లు వెలిగాయి.

శేఖరం ఉన్నవాడు ఉన్నట్లుగా ఉలికిపడ్డాడు. తన కళ్ళముందు ఏదో మెరుపు మెరిసిన ట్లయింది. వీధివెంట నడుస్తుంటే, ధగధగ ఎర్రరాళ్ళతో మెరిసిపోతున్న బంగారు ఉంగరం దొరికినట్లైంది. ఎట్టఎదురుగా హాస్పిటల్ వార్డులో, ఒక గదికిటికీలోంచి ఆకాశంలోకి చూస్తున్న అమ్మాయి. సంధ్య కాదా! అయ్యో!! సంధ్య హాస్పిటల్‌లో ఎందుకుంటుంది. అదుగో సంధ్య ముఖమే! అందమైన పెద్దపెద్ద కళ్ళు; ఎర్రనిబొట్టు; రెండుజడలు; సన్నని ఎర్రని పెదవులు. సంధ్యే! శేఖరం మనస్సు విలవిల లాడిపోయింది. ఆ అమ్మాయి అలాగే, నిస్పృహగా, విరాళగా, విరాసక్తంగా, పార్కులోని పూల చెట్లపైన చూపులు బరపింది. తనను కూడా చూసింది. కాని ఆ చూపులు గాజు కళ్ళలోనుంచి చూసినట్లుగా ఉన్నాయి; అమిత పేలవంగా ఉన్నాయి. ఆ అమ్మాయి చెక్కిళ్ళుకూడా మరీ పాలిపోయి ఉన్నాయి. తనను గుర్తుపట్ట లేదుగాఉంది అనుకున్నాడు శేఖరం. అప్పటికే చీకటిపడిపోయింది. లైట్లు వెలిగాయి.

శేఖరం భారమైన హృదయంతో హాస్టల్‌కు వెళ్ళిపోయాడు. ఆ రాత్రి అతడి కసలు నిద్రపట్టలేదు. మధ్యాహ్నం రెండుగంటలకల్లా క్లాసులు ఐపోయాయి. అప్పుడే సిటీకి బయలుదేరాడు. కోటీలో బస్సు దిగాడు. మనస్సంతా ఎంతో క్రుంగిపోయింది. కాఫీ త్రాగబుద్ధిపుట్టటం లేదు. ఎవరైనా తెలిసిన మొహాలు కనపడి, కాఫీకి రమ్మంటారో, మా ట్లాడుతూ

పిలుచో పెడతారో అనీ మనస్సంతా ఆందోళనగా ఉంది. రోడ్డు దాటి, కళ్ళు కాని నడుస్తుంటే ఎట్టఎదురుగా, పెద్ద అక్షరాలతో, రంగురంగుల బొమ్మలతో ఒక ప్రకటన అతణ్ని ఆకర్షించింది. ఈ దేశంలో క్షయవ్యాధివలన అసంఖ్యాకంగా మనుషులు చచ్చిపోతున్నా రనీ, క్షయవ్యాధి నిర్మూలనానికి, చేతనైనంత సహాయం అందరూ చేయాలనీ, ఆ ప్రకటన అభ్యర్థిస్తున్నది. శేఖరం మనస్సు వికల మైపోయింది. చాలా రోజులక్రితం అతడు ఏదో పేపర్లో చూశాడు. ఈ దేశంలో రోజూ, నిమిషానికి ఒకరు చొప్పున క్షయవ్యాధికి బలైపోతున్నా రని.

శేఖరం వెళ్ళి హాస్పిటల్ ఎదురుగా పార్కులోకి వచ్చాడు. పార్కులోకి ఇంకా ఎవరూ రాలేదు. ఎవరో చిన్న పిల్లలు నలుగురైదుగురు చేరి సిమెంటు బెంచీలచుట్టూ తిరిగి ఆడుకుంటున్నారు. ఆస్పత్రిలో, వార్డులలో గదికిటికీలు ఇంకా తెరవలేదు. మెయిన్‌గేటుద్వారా, ఎవరో పోతూ, వస్తూ ఉన్నారు కాని, బయటివాళ్ళకు, ఆస్పత్రిలో గదుల్లో ఉన్న రోగు లెవ్వరూ కనపడటం లేదు. శేఖరానికి ఏమీ తోచలేదు. అక్కడే కూలబడిపోయాడు. అప్పటికి మూడుంబావుకంటే ఎక్కువ కాలేదు టైము. అక్కడ కూచోలేకపోయాడు. ఎక్కడికి పోవాలోకూడా తోచటం లేదు. మనస్సంతా అల్లకల్లోలంగా ఉంది. అక్కడినుంచి లేచి అర్థం పర్థం లేకుండా ఒక వీధిలోంచి ఒక వీధిలోకి తిరిగాడు. ఐదున్నర కాగానే పార్కు ముందుకు వచ్చాడు. పార్కులోకి వెళ్ళకుండానే, రోడ్డుమీద నిలబడి హాస్పిటల్ వార్డువైపు చూశాడు. గదుల్లోని కిటికీలు తెరిచున్నాయి. సందేహం లేదు; ఆ రూములో నిన్న నిలబడి తనను చూసింది, తాను చూసిందీ సంధ్యే! ఎర్రని ఎండవచ్చి, ఆ గదుల్లో రోగులను ఓదారుస్తోంది. చూడటానికి వచ్చిన బంధువులంతా తిరిగిపోతున్నారు.

సంధ్య శేఖరాన్ని చూసింది. అవిడ గుర్తుపట్టనట్లు చేస్తున్న ప్రయత్నమంతా శేఖరం పసికట్టాడు. ఎప్పుడో ఎండిపోయిన కళ్ళు, తడికావటంకూడా అతడు గ్రహించక పోలేదు. అతడికి కూడా కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. సాయంకాలం వాలిపోయి, చీకట్లు గుంపులుగుంపులుగా వచ్చి ఆస్పత్రినీ, పార్కునూ, అంతనూ వ్యాపించి, లైట్లు వెలిగిన తరువాత, ఆస్పత్రివార్డులోని గది కిటికీలు మూసివేయబడిన తరువాత, ఆలస్యంగా, తొమ్మిదిగంటలకు, ఆవాళ శేఖరం హాస్టల్‌కు వెళ్ళాడు. హాస్టల్‌లో అన్నం పెట్టే వేళ మించిపోయింది. అయినా శేఖరం మనసు నిండా ఆర్తి. అన్నం గురించిన ఆలోచన లేనేలేదు.

మర్రోజూ అంతే అయింది.

ఆ మర్రోజూ కొంచెం తేరుకున్నాడు. కాని సాయంకాలం సంధ్యను చూసే వచ్చాడు

సంధ్య మొహం రోజురోజుకూ, తనను చూసి ప్రసన్నమౌతున్నది. తేటతనం తెచ్చుకుంటున్నది. ఆమె కళ్ళలో ప్రాణం లేచివచ్చినట్లు అనిపిస్తున్నది. కాని తాను అలా ప్రతిరోజూ, అలా వచ్చి ఆమెకు కనపడటము ఇష్టం లేనట్లుగానే అనిపించినప్పుడు శేఖరం ఎంతో మనస్సు కష్టపెట్టుకుంటున్నాడు. కాని అతడు ప్రతిరోజూ సాయంకాలము, అలా వెళ్ళి, మూగచూపులతోనే, మూగ భాషతోనే, సంధ్యను చూసి, పలకరించికాని, నిలవలేకపోతున్నాడు. అప్పటికి కాని తన మనస్సును తాను విప్పరించుకోలేకపోతున్నాడు.

అది దినచర్య అయింది.

తాను ఏమైపోతున్నాడో తెలియటం లేదు.

సంధ్య తనతో మాట్లాడితే బావుండు.

అది కొంచెం తృప్తి. ఈ విధమైన కోతకు కొంత ఉపశాంతి.

అనుకున్నట్టుగానే మర్రోజు సంధ్య సైగచేసి దగ్గరకు రమ్మని పిలిచింది శేఖరాన్ని. శేఖరం ఆశ్చర్యానికీ, ఆనందానికీ అవధులులేవు. మెల్లిగా వణికిపోతూ, అడుగులో అడుగు వేసుకుంటూ, రోడ్డు దాటి, సంధ్య నిలుచున్న కిటికీదగ్గరకు వెళ్ళాడు. లైట్లు వెలిగాయి. ఎవరో దూరంగా, తనను చూడటం కొంచెం సిగ్గుగా వుంది శేఖరానికి. రోడ్డుమీద మనుషులూ, కార్లూ, రిక్షాలూ, పార్కులో పూలూ, పిల్లలూ, పెద్దలూ, సంగీతం.

సంధ్య తన మనస్సు సంతోషించేట్లుగా, అనునయంగా, తీయగా, ఆపేక్షగా మాట్లాడుతుం దనుకున్నాడు. అలా చేయకపోగా, గుబుక్కున, వికారంగా, బాధగా, కోపంగా, దిగమింగుకుంటూ ఏడ్చింది శేఖరం దగ్గరకు రాగానే. శేఖరానికి రోడ్డు నడిమధ్యన, బలవంతాన, తన నెవరో కారుకిందికి తోసి వేస్తున్నట్లనిపించింది.

సంధ్య కళ్ళు తుడుచుకుని "నీవు నాకు ఇక కనపడకు. నన్నెందు కిలా వేధిస్తావు. నేను నీ కేం చేశాను. నిన్ను చూస్తే నాకు చెప్పలేని దుఃఖం. నా జీవితంలో వెల్తి అంతా నాముందు వికృతంగా నిల్చి నన్ను భయపెడుతోంది."

"ఏం, నే నేం చేస్తున్నాను."

"నాకు టి బి. అని డాక్టర్లు మా నాన్నగారిని భయపెట్టారు. ఇక్కడ రెండు నెల లుంటేగాని ఆ భయం, ఆధార సహితమో, కాదో తేలదు. ప్రాథమిక దశలో ఇక్కడ ఉండాలి. నిజమే అయితే, ఊరికి దూరంగా, శానిటోరి



యంలో చేరిపోవాలి. నా కెవరైనా తెలిసినవాళ్ళు కనపడితే, ఎందుకో చెప్పలేని దుఃఖం కలుగుతోంది. నాకు టి.బి. అన్న విషయం నేను మరచి పోదామని ప్రయత్నిస్తూ వుంటే, తెలిసిన వాళ్ళు కనపడగానే, అన్నిటికన్నా ముందు నాకు టి. బి. అన్న విషయం నా నిండా నిండి బ్రహ్మరాక్షసిలా నా గొంతు నొక్కి చంపుతున్నట్లుగా అనిపిస్తూఉంటుంది. దయచేసి..."

ఇక మాట్లాడలేకపోయింది. తల ఎత్తిచూస్తే కళ్ళనిండా నీళ్ళు. తన తల

భూమిలోకి కృంగిపోతున్నట్లూ, తప్పు చేసినట్లూ, ఆ తప్పుకు నిష్కృతి లేనట్లూ శేఖరం వెళ్ళిపోయాడు.

ఎట్లా? ఏ విధంగా తాను బ్రతకగలడు.

ఈ తన కళ్ళముందు కనపడుతున్న ప్రపంచమంతా సజీవంగానే ఉందా?

శేఖరం రెండురోజులు గదితలుపులు బంధించుకొని. లోపలే ఉండగోరాడు. రెండు రోజులూ వీధులన్నీ అర్థం లేకుండా తిరుగదలచాడు. కాని ఎక్కడా నిలవలేక, కూచోలేక, ఏమీ చేయలేక పోయాడు.

ప్రొద్దుపోయిన తరువాత, ఆవేపు వెళితే, గదితలుపులు మూసిఉండటం చూసేవాడు.

కాని నాలుగురోజుల తరువాత, నక్కి నక్కి, ఏ చెట్టుచాటుమంచో, ఏ తీగ వెనుకనుంచో చూస్తే, సంధ్యకళ్ళు వెఱ్ఱి తపనతో, దేన్నో వెతుక్కోవటం అతడు చూడకపోలేదు.

ఇలా నాలుగురోజులు గడిచిన తరువాత, అయ్యోయ్యో, ఎంత ప్రమాదం. అనుకోకుండా పట్టుబడి పోయాడు. రెండుచేతులూ ఎత్తి, ఆశతో, ఆనందంతో, చప్పట్లు చరచి, తనను పిలుస్తోంది సంధ్య.

"అమ్మ! వచ్చావుకదా! వారం రోజులుగా ఏంత ఏడుస్తున్నానో, నీతో ఎందు కలా అన్నానా అని. నిజంగానే రావనుకొన్నాను. ఎంత మంచివాడివి! నా కింకేం కోరికలేదు. ప్రతిరోజూ వచ్చి ఒకసారి కనపడిపో శేఖరం, శేఖరం..." మాట్లాడలేకపోయింది.

శేఖరం తనను తాను నమ్మలేక పోయాడు.

ఆస్పత్రి గేటుపక్కనే, చిన్నచిన్న పొదలుగా రంగు రంగులపూలు పూచి ఉన్నాయి. గేటుపైని ఉన్న పెద్ద లైటు కాంతిపడి, ఆ పూలన్నీ వెలిగిపోతున్నాయి. శేఖరం పరీక్షగా చూశాడు; సన్ననికాడలతో, ఎఱ్ఱని, తెల్లని, పసుపుపచ్చని, సంధ్యమల్లె పూలు — ప్రొద్దున కల్లా వాడిపోతాయి. ఇప్పు డెంత అందంగా ఉన్నాయి.

సంధ్యవైపు చూశాడు.

సంధ్యకళ్ళకి శాంతి.

సంధ్య కళ్ళు తుడుచుకుంది.

శేఖరం మౌనంగా ఆమెవేపు ఒక్కక్షణం చూసి, తలఊపి, మెల్లగా, జాగ్రత్తగా, రోడ్డుదాటటానికి అడుగు ముందుకు వేశాడు.